క్లుప్తంగా

31న వాహనాల వేలం

నకిరేకల్ : నకిరేకల్‌లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 31న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈ నెల 31న ఉదయం 10గంటల లోపు రూ.2,50,000 చెల్లించి రశీదు పొందాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు సెల్ : 8712658948, 8500304159 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కూలిన ఆశ్రమం ప్రహరీ



చందనపల్లిలో కూలిన ఆశ్రమం ప్రహరీ

నల్లగొండ రూరల్: నల్లగొండ మండల పరిధిలోని చందనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు శ్రీసేవా చారిటబుల్ ట్రస్టు ప్రహరీ కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకుని తమకు సహకారం అందించాలని ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు కోరారు.

టీఎస్‌వైఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మస్తాన్



మస్తాన్

శాలిగౌరారం: తెలంగాణ రాష్ట్ర స్టుడెంట్ యూత్ అసోసియేషన్(టీఎస్‌వైఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన దేవరకొండ మస్తాన్ అలియాస్ జానయ్య నియమితులైనట్లు ఆ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షుడిగా మండలకేంద్రంలోని బాలిశెట్టిగూడేనికి చెందిన తాటిపాముల నర్సింహను నియమించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శాలిగౌరారం: మండలకేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొనసాగిన భాగవత సప్తాహం



నల్లగొండ : పూజలు చేస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి అక్కినేపల్లి శ్రీదేవి లక్ష్మణరావు నివాసంలో నాలుగో రోజు భాగవత సప్తాహం కొనసాగింది. సోమవారం పెరుమాళ్ల చందన అలంకరణ కార్యక్రమంలో 150 మంది భక్తులు ఇష్టాగోష్ఠిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేపల్లి శ్రీదేవి, లక్ష్మణరావు, రాఘవాచార్యులు, గోపాల కృష్ణమాచార్యులు, రామ రంగాచార్యులు, సీతారామానుజచార్యులు, వేదాంతం రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శాలిగౌరారం: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని చిత్తలూరు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కొమ్మిడి వీరారెడ్డికి చెందిన గేదె గ్రామ సమీపంలోని పంటపొలాల్లో మేతకు వెళ్లే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఈదురుగాలులతో రూ.20లక్షల నష్టం



మునుకుంట్లలో కూలిన విద్యుత్ స్తంభం

కట్టంగూర్ : మండల వ్యాప్తంగా ఆదివారం వీచిన ఈదురుగాలులకు సుమారు 200కు పైగా విద్యుత్ స్తంభాలు నెలకొరగటంతో రూ.20 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఏఈ కుమార్ సోమవారం తెలిపారు. ఈదురు గాలులతో మండలంలోని 12 గ్రామాల్లో ఆదివారం రాత్రి విద్యుత్ సరఫరా పూర్తి నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనిచేసి 50 నూతన స్తంభాలను ఏర్పాటు చేసి సోమవారం సాయంత్రం వరకు అన్ని గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఓటెత్తిన పట్టభద్రులు



నల్లగొండ: సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్‌లో బారులుదీరిన మహిళా పట్టభద్రులు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం తర్వాత ఊపందుకున్న పోలింగ్
- మునుగోడు మండలంలో గతం కంటే తగ్గిన పోలింగ్ శాతం



మునుగోడు : ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన పట్టభద్రులు

నకిరేకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నకిరేకల్‌లో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్లకు నకిరేకల్ జడ్పీ హైస్కూల్‌లోనే నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండల వ్యాప్తంగా 3,521మంది ఓటర్లకు గాను 2,598 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.78శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా, నకిరేకల్‌లో జెడ్పీ హైస్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నేత దైద రవీందర్, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, గోట్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పోలింగ్ సరళిని పరిశీలించారు.

నార్కట్‌పల్లిలో 77.3 శాతం

నార్కట్‌పల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నార్కట్‌పల్లి మండలంలో సోమవారం ప్రశాతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 2,327 ఓటర్లకు గాను 1,729 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 1,087 పురుషులు, 642 స్త్రీలు ఓటు హక్కును వినియోగించుకోగా 77.3శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

కట్టంగూర్ : ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు బూతుల్లో మండలంలోని 1,874 గ్రాడ్యుయేట్‌లకు గాను 1,360 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ తెలిపారు. మండలంలో 72.5 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు.

కేతేపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం కేతేపల్లి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 72.39 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు ఊపందుకుంది. పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో కేవలం 10శాతం మాత్రమే నమోదైంది. మండల వ్యాప్తంగా 1456 మంది ఓటర్లకుగాను 1054 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 716 మహిళలు 338 మంది ఉన్నారు. కేతేపల్లిలో ఎమ్మెల్యే వేముల వీరేశం పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చండూరు, గట్టుప్పల్‌లో..

చండూరు : చండూరు, గట్టుప్పల్ మండలాల్లో పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. చండూరు మండలంలో 72.8 శాతం కాగా 2,472 ఓటర్లకు 1,802 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గట్టుప్పల్ మండలంలో 77.70 శాతం కాగా 722 మంది ఓటర్లకు 561 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ సుబ్రమణ్యం ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకున్నారు.

తిప్పర్తిలో..

రామగిరి(నల్లగొండ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం తిప్పర్తి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 1683 ఓట్లకు గాను, 1285 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.76 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

శాలిగౌరారంలో 69.67...

శాలిగౌరారం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం శాలిగౌరారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా మొత్తం 1807 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 1259 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో 69.67 శాతం ఓటింగ్ నమోదైంది. ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది. పోలింగ్ కేంద్రంలోని ఓటింగ్ సరళిని తహసీల్దార్ మహ్మద్ అన్వర్ హుస్సేన్ పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాగా, ఓటింగ్ సరళిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరిశీలించారు.



నార్కట్‌పల్లి : బారులుదీరిన పట్టభద్రులు



గట్టుప్పల్ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం



కట్టంగూర్ హైస్కూల్‌లో బారులుదీరిన ఓటర్లు



శాలిగౌరారం : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్



కేతేపల్లి: గుర్తు చూపుతున్న పట్టభద్రులు



నకిరేకల్ : పోల్‌చిట్టీలు చూపుతున్న పట్టభద్రులు

మర్రిగూడలో 76.1 శాతం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 1,384 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా 1,052 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 76.01శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ సరళిని చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ కె.రంగారెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.



మర్రిగూడ : పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న పట్టభద్రులు

కనగల్‌లో..

కనగల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 2,168 ఓట్లకు 1075 ఓట్లు పోలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కనగల్ : బారులుదీరిన పట్టభద్రులు

చిట్యాలలో 76.89 శాతం పోలింగ్



చిట్యాల: పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గుర్తు చూపుతున్న నల్లగొండ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

చిట్యాల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం చిట్యాల మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 76.89 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 3,025 మంది ఓటర్లుకు గాను 2,326 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1,901 పురుష ఓటర్లుకు గాను 1509 మంది, 1,124 మహిళ ఓటర్లుకు 817 మంది ఓటు వేశారు. చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 8 నుంచి ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం 4 గంటలకు ముగియాల్సిన పోలింగ్ అదనంగా మరో ఇరవై నిమిషాల పాటు కొనసాగింది. పోలింగ్ కేంద్రాలను నల్లగొండ ఏఎస్పీ రాములునాయక్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సైదాబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఓటు వేసిన ప్రముఖులు

చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, నల్లగొండ పార్లమెంటు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి ఇందిరా ప్రియదర్శిని, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, స్వతంత్రఎమ్మెల్సీ అభ్యర్థి ఆశోక్ పరిశీలించారు.

మునుగోడులో 73.11 శాతం..



మునుగోడు : ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళా పట్టభద్రులు



గుర్తు చూపుతున్న సీపీఐ నాయకుడు నెల్లికంటి సత్యం

మునుగోడు: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మునుగోడు మండల వ్యాప్తంగా 73.11 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 2,432 మంది ఉండగా 1,778 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 1,172 మంది, స్త్రీలు 606 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.మధ్యాహ్నం 2గంటల వరకు కేవలం 34 శాతం నమోదైన పోలింగ్ రెండు గంటల వ్యవధిలోనే 50శాతానికి పెరిగింది. కాగా, 2021 మార్చి మాసంలో జరిగిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 84 శాతం పోలింగ్ నమోదు కాగా సోమవారం జరిగినా ఉప ఎన్నికలో 11శాతం తగ్గింది.

డబ్బులు తీసుకొని ఓటు వేయాలని..

తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసేందుకు అధిష్టానం డబ్బులు పంపించిందని, ఓటర్లు ఆ డబ్బులు తీసుకొని ఓటు వేయాలని మునుగోడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ రాజకీయ పార్టీ నాయకుడు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. అది సోషల్ మీడియాలో వైరల్ కాగా ఇతర పార్టీల నాయకులు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు అతడి కోసం గాలించినా ఆచూకీ లేకపోవడంతో, పోస్టుపెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.





నల్లగొండలో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న కాంగ్రెస్ నాయకుడు అమిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి



నల్లగొండ : గుర్తు చూపుతున్న బీజేపీ నాయకుడు నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు





నల్లగొండ : బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి దంపతులు, కాసం వెంకటేశ్వర్లు









చండూరు : గుర్తు చూపుతున్న గీత కార్మిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ దంపతులు, టీపీసీసీ నాయకుడు పున్న కైలాస్ నేత, బీఆర్‌ఎస్ నేత చాడ కిషన్‌రెడ్డి, సీపీఐ నాయకుడు ఆదిరెడ్డి

గాలి వాన భీభత్సం



పెద్దవూర: లింగంపల్లిలో కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దవూర: మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. మండలంలోని లింగంపల్లి, తుమ్మచెట్టుతండాలలో రెండు 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 7 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.దాసయ్య సోమవారం తెలిపారు. దీంతో లింగంపల్లి-చింతపల్లి రోడ్డులో గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో తీగలన్నీ రైతుల పండ్ల తోటలు, వ్యవసాయ పొలాలు, రోడ్డుపై పడిపోయాయి. వీటిని సోమవారం తొలగించి నూతన స్తంభాలను నాటారు.

ఘనంగా సినీ స్వరాభిషేకం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌పీఆర్ డీజీ పాఠశాలలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత, ప్రముఖ సినీ నటుడు ఎన్‌టీఆర్ (నందమూరి తారక రామారావు) జయంతిని పురస్కరించుకొని సోమవారం సినీ స్వరాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ, గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల నుంచి పాటలను పాడి మెప్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీర్, మూసా అలీఖాన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ విధంగా కళాకారులు ముందుకు వచ్చి కొత్తదనం తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టరేట్ పొందిన డాక్టర్ మునీర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ సైదులు, సాంకేతిక విభాగం అధ్యక్షుడు నాగేందర్, నిర్వాహకులు జకినాలపల్లి శ్రీనివాస్‌చారి, సుదర్శన్, ఎం. సత్యనారాయణ, ఏలే సత్యనారాయణ, గాయకులు వెంకటేశ్వర్లు, అబ్రహం, సరస్వతి, మౌనిక, సుజాత, సరిత, రజిత, పరమేశ్వరి పాల్గొన్నారు.

● అ'పూర్వ' సమ్మేళనం



కట్టంగూర్ మండల కేంద్రంలో సమావేశమైన చైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ప్రమాదకరంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కనే సుమారు 43 సంవత్సరాల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవటంతో మూడేళ్ల క్రితమే మంచినీటి సరఫరా నిలిపివేశారు. ట్యాంకు అడుగుభాగం ఇనుప చువ్వలు తేలి కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పాఠశాల విద్యార్థులు నిత్యం ట్యాంకు సమీపంలో ఆటలు ఆడుకుంటుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల పునః ప్రారంభం కాక ముందే నిరుపయోగంగా ఉన్న ట్యాంకును వెంటనే కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవటం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మునుకుంట్లలో శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంకు

ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన మురుగు

మునుగోడు: మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీలో గల మిషన్ భగీరథ మంచి నీటి ట్యాంక్ చుట్టూ మురుగు చేరింది. మునుగోడు పట్టణానికి చెందిన పలు కాలనీల ప్రజలు తమ ఇళ్లలో వినియోగించిన మురుగు సాఫీగా వెళ్లేందుకు మురికి కాల్వలు లేకపోవడంతో ఆ మురుగంతా ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లోకి వదులుతున్నారు. ఆ ఇళ్ల స్థలాల పక్కనే ఉన్న నీటి ట్యాంక్ చుట్టూ మురుగు చేరడంతో మంచి నీరు సరఫరా చేసే పైపు లీకై ట్యాంక్ చుట్టూ నిలిచిన మురుగు ఆ నీటిలో కలిసి కలుషితమయ్యే అవకాశం ఉంది. అంతే కాకుండా మురుగు దుర్వాసన వెదజల్లుతుండడంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్ చుట్టూ నిల్వ ఉన్న మురుగును లేకుండా చేయడంతోపాటు డ్రెయినేజీలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



మంచి నీటి ట్యాంక్ చుట్టూ చేరిన మురుగు

రిజర్వేషన్ల తగ్గింపుపై ప్రభుత్వం స్పందించాలి

మిర్యాలగూడ టౌన్ : రిజర్వేషన్ల తగ్గింపుపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ సోమవారం బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓకు వినతిపత్రం అందజేశారు. గిరిజనుల 10శాతం రిజర్వేషన్ల అమలుపై కొంత మంది గ్రూప్-1 అభ్యర్థులు కోర్టుకు వెళ్లడంతో గిరిజనులకు న్యాయం చేయాలని కోర్టు సూచించినట్లు ఆ పత్రంలో వివరించారు. రిజర్వేషన్లు తగ్గిస్తే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని, రిజర్వేషన్ల తగ్గింపుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ పత్రంలో కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మక్లా నాయక్, జైత్రంనాయక్, సీతారాంనాయక్, బాలు, వెంకన్న, దాస్యనాయక్, సురేష్, వెంకన్న, శశిధర్, నరేష్ తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నల్లగొండ టౌన్ : పానగల్ ఉదయ సముద్రం చెరువులో చేపల వేటకు వెళ్లి ఈదురుగాలులకు నీట మునిగి మృతిచెందిన చందనపల్లి గ్రామానికి చెందిన కొడదల సైదులు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జీజీహెచ్‌లోని మార్చురీ వద్ద సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈదురు గాలులకు కూలిపోయిన ఇళ్లకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి, పెద్ది గోవర్ధన్, పెద్ది వెంకటయ్య, రూపని లింగయ్య, ఉప్పల జాని, ఆలకుంట్ల వెంకన్న, కొడిదల మణి, రూపని ఎల్లయ్య, ఒర్సు నాగయ్య, భూపతి యాదయ్య, పాల్గొన్నారు.